

సాక్షి
గుంటూరు

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2,901 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1,001 క్యూసెక్కులు వదిలారు.



30 టీఎంసీలకు పులిచింతల

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టులో నీటినిల్వ గురువారం సాయంత్రానికి 30 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 6543 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పశువైద్య వర్సిటీ పాలకమండలి సభ్యులుగా యుగంధర్ కుమార్



నెహ్రూనగర్ : శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం (తిరుపతి) పాలక మండలి సభ్యులుగా గుంటూరు జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎం.యుగంధర్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ల పాటు పాలకమండలి సభ్యులుగా వ్యవహరించనున్నారు.

న్యూస్‌రీల్

నేడు మిర్చి యార్డు పాలకవర్గ సమావేశం



కొరిటెపాడు : గుంటూరు మార్కెట్ యార్డు పాలకవర్గ సమావేశం చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరుగుతుందని మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. సమావేశంలో మార్కెట్ యార్డుకు సంబంధించి ఆదాయ వ్యయాలు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



మేడికొండూరు: పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా మేడికొండూరు మండల పరిధిలోని పేరేచర్ల కైలాసగిరి ప్రాంతంలో నిర్మిస్తున్న గృహాలను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి గురువారం పరిశీలించారు. పేరేచర్లలోని జగనన్న–3 లేఅవుట్‌లో నిర్మిస్తున్న గృహాలను పరిశీలించిన అనంతరం అధికారులతో ఆయన మాట్లాడారు. 188 గృహాల్లో 104 ఇళ్లు పూర్తయ్యాయని, అధికారులు పూర్తి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటికీ పీఎం ఆవాస్ యోజన, నవరత్నాలలో పేదలందరికీ ఇళ్లు లోగోలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, లే అవుట్ ప్రత్యేక అధికారి వీరాచారి, హౌసింగ్ ఈఈ శంకరరావు, తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, హౌసింగ్ ఏఈ దివ్య తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి స్వచ్ఛ పక్వాడ్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రైల్వే బోర్డు మార్గదర్శకాల ప్రకారం గుంటూరు డివిజన్‌లో ఈనెల 16 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛ పక్వాడ్ పక్షోత్సవాలను నిర్వహించనున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ గురువారం తెలిపారు. ఈనెల 16న గుంటూరు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ ప్రతిజ్ఞ నుక్కడ్ నాటకం, ప్రభాత్ ఫేరి (ర్యాలీ), ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

అంబేడ్కర్ వర్సిటీ దూర విద్య కోర్సుల్లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో దూర విద్య బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ అధ్యయన కేంద్ర ప్రాంతీయ సమన్వయ కర్త పి.గోపీచంద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం,ఎమ్మెస్సీ కోర్సుల్లోనూ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. యూజీ ద్వితీయ, తృతీయ, పీజీ ద్వితీయ సంవత్సర ఫీజులు చెల్లించేందుకు ఈనెల 30 చివరి తేదీగా తెలిపారు. 0863- 2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దేవాలయ పునర్నిర్మాణానికి చెక్కు అందజేత



భట్టిప్రోలు: ఐలవరం రామలింగేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున చేతుల మీదుగా కార్యనిర్వహణాధికారి జీవీఎల్ కుమార్‌కు రూ. 2 లక్షలు చెక్కు అందజేశారు. దేవాలయ పునర్నిర్మాణానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అడిగిన మేరకు దేవదాయ శాఖాధికారులతో మాట్లాడి ఇందు కోసం రూ. 20 లక్షలు మంజూరు చేయించినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, కేబీవీ రమణ, మాచర్ల తులసీ రంగారావు, గట్టు శ్రీనివాసరావు, జొన్నాదుల శరత్‌బాబు, వెనిగళ్ల నాంచారయ్య పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 855.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 7,803 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

తూర్పున నవోదయం

తూర్పు' బైపాస్‌కు మార్గం సుగమం

- పొట్టిపాడు నుంచి కాజ వరకు నాలుగు లేన్ల రహదారి
- కృష్ణా నదిపై 3.75కి.మీ పొడవుతో వంతెన నిర్మాణం
- కోల్‌కత– చెన్నై హైవే ప్రయాణికులకు సౌలభ్యం
- బందరు పోర్టుకూ కనెక్టివిటీ




తూర్పు బైపాస్ కాజ వద్ద జాతీయ రహదారికి అనుసంధానం కానున్న ప్రదేశం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడను మరో మణిహారం అలంకరించనుంది. జాతీయ రహదారిని కలుపుతూ మరో బైపాస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. కృష్ణా జిల్లా పొట్టిపాడు నుంచి గుంటూరు జిల్లా కాజ వరకు 49.51 కిలోమీటర్ల పొడవున నిర్మించతలపెట్టిన ఈ రహదారి ప్రతిపాదనలకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్టు సమాచారం. దీంతో విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి. ఈ రహదారిపై ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీతో ప్రత్యేకంగా చర్చించారు. గడ్కరీ సానుకూలంగా స్పందించడంతో ఈ బైపాస్ కోసం మూడు రూట్ మ్యాప్‌లను అధికారులు సిద్ధం చేశారు. 49.51 కిలోమీటర్ల మేర నిర్మించే ప్రతిపాదనపై కేంద్రం మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. కృష్ణా జిల్లా పరిధిలో 27.71 కిలోమీటర్లు, గుంటూరు జిల్లాలో 19.80 కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మాణం కానుంది. ఇందులో కృష్ణానదిపై 3.750 కిలోమీటర్ల మేర వంతెన నిర్మాణం చేయనున్నారు. 100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ప్రయాణించేందుకు వీలుగా నాలుగు వరుసల రహదారిని నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో ఆరు వరుసల రహదారి విస్తరణకు వీలుగా 60 మీటర్ల వెడల్పుతో అలైన్‌మెంట్‌ను సిద్ధం చేశారు.

రహదారి నిర్మాణం ఇలా..

కృష్ణా జిల్లాలో ఉంగుటూరు వద్ద నుంచి గన్నవరం, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాల నుంచి గుంటూరు జిల్లాలో కొల్లిపర, దుగ్గిరాల, మంగళగిరి మండలాల మీదుగా ఈ బైపాస్ కాజ వద్ద జాతీయ రహదారికి అనుసంధానమవుతోంది. ఈ బైపాస్‌పై కృష్ణానదిపై వంతెనతో కలిసి ప్రధాన బ్రిడ్జిలు ఐదు, మైనర్ బ్రిడ్జిలు 28, ఆర్వోబీలు 2 , కల్వర్టులు 149, ఫ్లైఓవర్‌లు 2, ఇంటర్ ఛేంజ్‌లు 2 నిర్మితం కానున్నాయి. దవులూరు వద్ద మచిలీపట్నం–విజయవాడ రహదారికి ఈ బైపాస్‌ను అనుసంధానం చేయనున్నారు. దీంతో బందరు పోర్టుకు కనెక్టివిటీ కలగనుంది. ఈ డీపీఆర్‌ను చైతన్య, కేజీఎం ఇంజనీరింగ్ సంస్థ రూపొందించింది. ప్రతిపాదనలను నేషనల్‌హైవే అథారిటీకి పంపామని, ఇంకా ఫైనల్ కాలేదని ఆర్వోఆర్‌కే సింగ్ తెలిపారు.



విజయవాడ తూర్పు బైపాస్ మ్యాపు

భూసేకరణకు ప్రత్యామ్నాయంగా..

రాష్ట్ర ప్రభుత్వం ఈ రహదారి నిర్మాణానికి అన్ని విధాలా సహకారం అందించేందుకు ముందుకు వచ్చింది. తొలుత భూసేకరణ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కేంద్రం కోరింది. ఆ తర్వాత భూసేకరణ తామే భరిస్తామని, దీనికి బదులుగా ప్రాజెక్టు నిర్మాణంలో వినియోగించే వివిధ ఖనిజాలకు తీసుకొనే సీనరేజి చార్జీలు, నిర్మాణ సామగ్రికి రాష్ట్ర జీఎస్టీని మినహాయించాలని కేంద్రం సూచించింది. జాతీయ రహదారి, రైల్వే లైనుకు దగ్గర మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కుకు 100 ఎకరాలు ఉచితంగా కేటాయించాలని కోరింది. వీటన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం ఓకే చెప్పింది.

తూర్పు బైపాస్‌కు డీపీఆర్ సిద్ధం



విజయవాడ బైపాస్‌కు డీపీఆర్ సిద్ధమైంది. దీనికి మూడు ప్రతిపాదనలు రూపొందించారు. కేంద్ర పెద్దలు, మోర్త్ అధికారులతో చర్చించి త్వరితగతిన నిధుల విడుదలకు కృషి చేస్తా. ఈ రహదారి నిర్మాణంతో ప్రధానంగా బందరు పోర్టుకు రాకపోకలకు ఉపయోగపడుతుంది.

– బాలశౌరి, ఎంపీ, మచిలీపట్నం

శుభసూచికం



కొత్తగా కాజ నుంచి పొట్టిపాడు వరకు తూర్పు బైపాస్‌కు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ జాతీయ రహదారి నిర్మాణంతో మంగళగిరి–తాడేపల్లి నగరం మరింత అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే పడమర బైపాస్ పనులు జరుగుతున్నాయి. ఇది శుభసూచికం.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే మంగళగిరి

నవంబర్‌లో 'జగనన్న విద్యాజ్యోతి'



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు వరుసగా రెండో ఏడాది ''జగనన్న విద్యాజ్యోతి'' స్టడీ మెటీరియల్ అందనుంది. జిల్లా పరిషత్ నిధులతో గతేడాది ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేసిన మెటీరియల్ అధిక మార్కుల సాధనకు దోహదపడింది. దీంతో ప్రస్తుత ఏడాది కూడా స్టడీ మెటీరియల్ రూపకల్పనకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రత్యేకంగా శ్రద్ధ చూపించారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఎంపిక చేసిన సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యాశాఖాధికారులు జెడ్పీకి అందజేశారు. గత ఏడాది మెటీరియల్ ముద్రణకు రూ.61.80 లక్షల నిధులను వెచ్చించారు. అప్పట్లో 36,155 మంది విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వ బడుల్లోని టెన్త్ విద్యార్థులందరికీ మెటీరియల్ అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నవంబర్‌లో మెటీరియల్‌ను పంపిణీ చేయనున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఇటీవల జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రకటించారు.

సీఎం వైఎస్ జగన్ ప్రోత్సాహంతోనే

గతేడాది టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించాం. దీనికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రశంసలు అందుకున్నాం. మెటీరియల్ టెన్త్ ఉత్తీర్ణతా శాతం పెంపునకు దోహదం చేసింది. సీఎం వైఎస్ జగన్ ప్రోత్సాహంతో వరుసగా రెండో ఏడాదీ స్టడీ మెటీరియల్ పంపిణీకి చర్యలు చేపడుతున్నాం.

– కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీ చైర్‌పర్సన్

జెడ్పీ ఆస్తుల రక్షణకు చర్యలు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ ఆస్తుల రక్షణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధికారులను ఆదేశించారు. గురువారం జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో హెచ్ సెక్షన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ సెక్షన్‌లో పెండింగ్‌లో ఉన్న బకాయిలను వసూలు చేయడంలో అనుసరించాల్సిన విధి, విధానాలపై సమీక్షించారు. కోర్టు కేసులు, జెడ్పీ వాణిజ్య సముదాయాల్లోని దుకాణాల నుంచి అద్దెల వసూలు, జెడ్పీ ఆస్తులు, అతిథిగృహాల పరిరక్షణ, నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఆక్రమణల్లోని ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.



సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

గ్రామ సచివాలయాల్లో నోటరీ సేవలు



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో వారంలో రెండు రోజులు అడ్వకేట్స్, నోటరీ సేవలందించాలని గుంటూరు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్ దామచర్ల శైలజ చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో భూములు, ఆస్తుల క్రయ, విక్రయాలకు సంబంధించి ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ వ్యవస్థలో నోటరీలు అందించాల్సిన సేవలపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆధ్వర్యంలో గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో గుంటూరు జిల్లాలోని అడ్వకేట్లు, నోటరీలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ ఆన్‌లైన్ స్టాంపుల విధానం గురించి వివరించారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 568 సచివాలయాలను క్లస్టర్లుగా విభజించి, సమీపంలోని అడ్వకేట్లు, నోటరీలను సంబంధిత క్లస్టర్‌కు జతపర్చినట్లు తెలిపారు. సోమవారం, గురువారం తమకు కేటాయించిన సచివాలయాలను సందర్శించి, నోటరీ సేవలను ప్రజలకు చేరువ చేయాలనేది ప్రభుత్వం ఆలోచనా విధానమని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌కు హాజరైన 53 మంది అడ్వకేట్లు, నోటరీలు ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు విల్లింగ్ లెటర్లతోపాటు కావాల్సిన క్లస్టర్ వివరాలను అధికారులకు సమర్పించారు. వర్క్‌షాప్‌లో గుంటూరు, తెనాలి డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారులు వి.సుజాత, కె.పద్మావతి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త జొన్నల రాజారామ్ మోహన్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆనందాల ఆరుతడి

ముందస్తు రబీ.. శుభమస్తు

- సాగర్‌లో నీటి కొరత, వర్షాభావంతో తగ్గిన ఖరీఫ్ సాగు
- సార్వాలో పత్తి సాగుకు ముగిసిన గడువు
- వరికి సరిపోని నీటినిల్వలు
- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి
- మినుము, పెసర, అలసంద, కంది సాగుకు అనుకూలం
- ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం



ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

సాక్షి, నరసరావుపేట: వర్షాభావం, నాగార్జున సాగర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో ఆరుతడి పంటలు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా లేకపోవడంతో ఖరీఫ్ ఆశాజనకంగా లేదు. సార్వాకు కీలకమైన ఆగస్టు నెలలో 68 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఫలితంగా ఇప్పటి వరకు ఖరీఫ్‌లో 29 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. గతేడాది ఖరీఫ్‌లో ఇదే సమయానికి 59 శాతం మేర పంటలు సాగులోకి వచ్చాయి. ఇప్పటి వరకు పత్తి 44 శాతం, మిర్చి 25 శాతం సాగు నమోదైంది. దీంతో రైతులు ముందస్తు రబీలో భాగంగా ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిసారిస్తున్నారు. వ్యవసాయాధికారులు ఇదే ఉత్తమమని సూచిస్తున్నారు. ఆ దిశగా కర్షకులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆరుతడి పంటలు వేసుకోవాలని చెబుతున్నారు. అయితే సెప్టెంబర్ నెలలో సాధారణ వర్షపాతం కన్నా 164 శాతం అధికంగా పడటం కొంత ఉపశమనం కల్పిస్తోంది. ఈ వర్షాలను ఉపయోగించుకొని విత్తనాలు విత్తుకున్నట్లయితే రైతులకు తక్కువ పెట్టుబడితో ఎంతో కొంత ఆదాయం లభించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

పల్నాడు జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఇలా(హెక్టార్లలో)..

సాధారణ విస్తీర్ణం :	2,76,947
ఇప్పటి వరకు సాగు :	79,786
గతేడాది ఈ వేళకు సాగు :	1,71,167

నీటి వనరులు ఉంటే జొన్న విత్తుకోవచ్చు

ఖరీఫ్‌లో పత్తి పంట సాధారణ విస్తీర్ణం 1,21,621 హెక్టార్లు కాగా, ఇప్పటివరకు 53,938 హెక్టార్లలో సాగైంది. వరి సాధారణ విస్తీర్ణం 49,202 హెక్టార్లు కాగా ఇప్పటికి కేవలం 4,183 హెక్టార్లలోనే సాగైంది. కొందరు రైతులు సాగర్‌కు సెప్టెంబర్ చివరి నాటికి నీరు వచ్చినా 120 రోజుల వ్యవధిగల హెచ్ఎంటీ, అంకుర్‌సోనా రకం వరి వంగడాలు సాగు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. పత్తి పంట సాగుకు ఇప్పటికే సమయం మించిపోయింది. వరి సాగుకు సరిపడా నీరు కాలువల్లో లేదు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలే మేలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మినుము, పెసర, అలసంద, కంది, జొన్న, శనగ పంటలు మేలని పేర్కొంటున్నారు. ఒకటి లేదా రెండు నీటి తడులకు వెసులుబాటు ఉన్న భూముల్లో మొక్కజొన్న, జొన్న పంటలను అక్టోబర్ నెలలో విత్తుకోవచ్చని సూచిస్తున్నారు.

విత్తనాలు సిద్ధం

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతుల కోసం వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలను సిద్ధం చేస్తున్నారు. మండలాలవారీగా అవసరతపై నివేదికలు తెప్పించారు. కంది 981 క్వింటాళ్లు, మినుములు 320 క్వింటాళ్లు, పెసర 25 క్వింటాళ్లు, శనగ 12,100 క్వింటాళ్లు అవసరమని అంచనా వేశారు. రాయితీతో రైతులకు ఆర్బీకేల ద్వారా అందించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచనున్నారు.

ఆర్బీకేల ద్వారా విత్తనాలు



ముందస్తు రబీ పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతుల కోసం విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మండలాల వారీగా ప్రత్యామ్నాయ పంట విత్తనాలు ఏ మేరకు అవసరమో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. రైతులకు ఆర్బీకేల ద్వారా విత్తనాలు అందిస్తాం. మినుము, పెసర, కంది, శనగ వంటి పంటలకు కనీస మద్దతు ధర అధికంగా ఉండటం రైతులకు మేలు చేస్తుంది.

– ఐ.మురళి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ప్రత్యామ్నాయమే మేలు



సాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉండటం, వర్షాభావ పరిస్థితులతో సమయం మించిపోవడం వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు వెళ్లడం ఉత్తమం. ఆ దిశగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా మినుము, పెసర, కంది, శనగ విత్తుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. కనీసం రెండు తడులు నీటిని అందించగలిగితే మొక్కజొన్న సాగు ఉపయుక్తం.

–డాక్టర్ జి.రమేష్, సీనియర్ సైంటిస్ట్, డాట్ సెంటర్, పల్నాడు జిల్లా

మీ చిట్టి చేతులతో మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

District sponsor

VIVA
THE SCHOOL BY VVIT

శిబిరం చిరునామా:

వివా
ది స్కూల్ బై వీవీఐటీ, నంబూరు
గుంటూరు జిల్లా

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 97030 13015

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.4,500, గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.5,800 వరకు పలికింది.

క్లుప్తంగా

నేడు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక స్పందన

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగులకు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

21న విజయవాడలో డాక్ అదాలత్

తెనాలి: తపాలశాఖ విజయవాడ ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 21వ తేదీన ఉదయం 11.30 గంటలకు డాక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసూనారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తపాల సేవలు పొందటంలో ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే విజయవాడ గాంధీనగర్‌లోని శాంతి, ప్రశాంతి థియేటర్ దగ్గర గల గాంధీనగర్ పోస్టాఫీసు పై అంతస్తులోని రీజియన్ కార్యాలయంలో ఆరోజు సంప్రదించాలని సూచించారు. స్వయంగా హాజరయేందుకు వీలుపడనివారు, ఈనెల 19వ తేదీలోగా తమ పిర్యాదులను అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్), పోస్టమాస్టర్ జనరల్ కార్యాలయం, విజయవాడ రీజియన్, విజయవాడ-520003 చిరునామాకు పంపాలని, కవరుపై డాక్ అదాలత్ అని రాయాలని వివరించారు.

యార్డులో 28,221 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 27,312 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 28,221 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,600 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,700 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి 11,646 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఏఎస్‌ఐలకు ఉద్యోగోన్నతి

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో 17 మంది ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి. పాలరాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఆభరణాలు

వెండి, బంగారు ఆభరణాల వ్యాపారుల సదస్సులో జాయింట్ డైరెక్టర్ టి.సుజాత


మాట్లాడుతున్న టి.సుజాత

తెనాలి: మినిస్ట్రీ ఆఫ్ కన్సూమర్ ఎఫైర్స్, ఫుడ్స్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ ఆధ్వర్యంలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్), విజయవాడ బ్రాంచి ఆధ్వర్యంలో గురువారం బంగారు ఆభరణాల వ్యాపారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. స్థానిక జైన్ దేవాలయం రోడ్డులోని బంగారు, వెండి వ్యాపారుల అసోసియేషన్ హాలులో ఏర్పాటైన సదస్సులో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, విజయవాడ బ్రాంచి ఎస్‌సీ-డి అండ్ జాయింట్ డైరెక్టర్ టి.సుజాత మాట్లాడారు. వెండి, బంగారు ఆభరణాలకు ఐఎస్‌ఐ మార్క్, హాల్‌మార్కింగ్‌పై బీఐఎస్ చట్టం-2016 మార్గదర్శకాలను తప్పకుండా అనుసరించాలని ఆమె స్పష్టం చేశారు. ఆభరణాల నాణ్యతను పాటింపజేసేలా వినియోగదారుల హక్కుల పరిరక్షణకు బీఐఎస్ పనిచేస్తుందని తెలిపారు. వెండి, బంగారు ఆభరణాల వ్యాపారులు ఎస్‌ఎస్‌డబ్ల్యూఎస్, మనక్ ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్టరు చేసుకోవటం, హాల్‌మార్కింగ్ విధానాన్ని తప్పక పాటించటం, బీఐఎస్ చట్టంలోని 14,15,17 సెక్షన్లు, అతిక్రమిస్తే సెక్షన్ 49 కింద విధించే నష్టపరిహారం అంశాలను వివరించారు. బంగారం, వెండికి గల భారతీయ ప్రమాణాలను వివరించారు. హాల్‌మార్కింగ్ స్కీం వల్ల వినియోగదారులకు, వ్యాపారులకు, హాల్ మార్కింగ్ కేంద్రాలకు గల ప్రయోజనాలను వివరించారు. తెనాలికి చెందిన యాభైమంది వ్యాపారులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి వద్దకే వైద్య సేవలు

వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై షేక్



పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు వైద్యాన్ని గడప ముంగిటకు తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై.షేక్ చెప్పారు. ఎత్తు రోడ్డు సెంటర్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం ఆరోగ్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారనీ, ఇందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈనెల 15 నుంచి 29వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికీ తిరిగి ఆయా నివాసాల్లో ఎవరూ ఏ వ్యాధితో బాధపడుతున్నారో తెలుసుకోవడం జరుగుతోందన్నారు. ఈనెల 30 నుంచి 45 రోజులపాటు నలుగురు వైద్యులతో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారన్నారు. ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగనుందన్నారు. ఉచిత వైద్యం అందించడంతోపాటు, సంబంధిత రోగులకు మందులు కూడా పంపిణీ చేస్తారన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ, 108, 104, విల్లేజ్ క్లీనిక్‌తో పాటు, అనేక ఆరోగ్య పథకాల ద్వారా పేద వారి ఆరోగ్యానికి భరోసా కల్పించిన సీఎం జగనన్న ఆరోగ్యశ్రీ సురక్ష ద్వారా వారికి మరింత మనోధైర్యం కల్పించనున్నారన్నారు. జిల్లాలో సైతం ప్రభుత్వ నిర్ణయానికి సహకరిస్తూ డాక్టర్స్ విభాగం ఆధ్వర్యంలో 50 మంది వైద్యులు బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. దీంతోపాటు ఈనెల 15 నుంచి 29వ తేదీ వరకు జరిగే ఇంటింటికీ సర్వే కార్యక్రమంలో డాక్టర్స్ సెల్‌కు సంబంధించిన వైద్యులు పాల్గొని ఆరోగ్యశ్రీ పట్ల అవగాహన కల్పించే దిశగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమావేశం

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సమావేశ మందిరంలో ఆషా నోడల్ ఆఫీసర్స్‌కు జగనన్న ఆరోగ్య సురక్ష, ఆయుష్మాన్ భవపై సమావేశం గురువారం జరిగింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు పౌరుల ఆరోగ్య సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో భాగంగా, ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఈనెల 30వ తేదీ తర్వాత నిర్వహించే మెడికల్ క్యాంపులకు రిఫర్ చేస్తారని వెల్లడించారు. మెడికల్ క్యాంపులలో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు, ఇద్దరు వైద్యాధికారులు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఆరోగ్యశ్రీ గురించి విస్తృతంగా ప్రచారం చేయడం, తీవ్రమైన సమస్యలతో పడుతున్న వారిని, గుంటూరు జీజీహెచ్‌కు, తెనాలి జిల్లా ఆస్పత్రులకు తరలిస్తారన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా అభ ఐడీ క్రియేషన్, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కార్డుల పంపిణీ, సెల్ ఎనీమియా గుర్తించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి.హెచ్.రత్న మన్మోహన్, డీపీహెచ్‌ఎన్‌ఓ కె.శాంత కుమారి, చంద్రశేఖర్, హెచ్‌ఈఈఓ పాల్గొన్నారు.

విదేశీ విద్యాభ్యాసానికి ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సహకారం

డెప్యూటీ డైరెక్టర్ మహ్మద్ కరీముల్లా



పెదకాకాని: విదేశాలలో విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెన్ట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్‌ఆర్‌టీఎస్) సహకరిస్తుందని డెప్యూటీ డైరెక్టర్ మహ్మద్ కరీముల్లా తెలిపారు. విద్యావాహిని ద్వారా స్కాలర్‌షిప్ కూడా అందుతుందని చెప్పారు. వీవీఐటీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఇండక్షన్ ప్రోగ్రాం (ప్రేరణ కార్యక్రమం)కు గురువారం డెప్యూటీ డైరెక్టర్ మహ్మద్ కరీముల్లా, అసిస్టెంట్ డైరెక్టర్ డి. పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ విదేశాలలో గల 27 విశ్వవిద్యాలయాలతో ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. విద్యార్థులకు ఉచిత కౌన్సెలింగ్, గైడెన్స్ అందిస్తుందని వివరించారు. అంతర్జాతీయ ర్యాంకింగ్‌లో టాప్ 100 యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు 100 శాతం, 100 నుంచి 200 యూనివర్సిటీలలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు 50 శాతం జగనన్న విదేశీ విద్యాదీవెన, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నట్లు చెప్పారు. కొన్ని విదేశీ విశ్వవిద్యాలయాలు ఉపాధితో కూడిన ఉన్నత విద్యను అందిస్తున్నాయని, వాటిపై విద్యార్థులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. అకడమిక్ పర్‌ఫార్మెన్స్ ఆధారంగా సరిపడా యూనివర్సిటీ, కోర్సు, స్కాలర్‌షిప్‌ల మంజూరుకు ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సహకారం అందిస్తుందని తెలిపారు. నాన్ రెసిడెంట్ తెలుగు విద్యార్థుల ద్వారా ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ ఐటీ శిక్షణను అందిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎన్. కుమారస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ ఆచార్యులకు ప్రపంచస్థాయి గుర్తింపు


డాక్టర్ ఎం. జానకిరామయ్య


డాక్టర్ బొగ్గవరపు నాగేశ్వరరావు

తాడేపల్లిరూరల్ : స్థానిక వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలోని ఆచార్యులకు ప్రపంచ స్థాయి టాప్ 2 శాతం శాస్త్రవేత్తలో స్థానం లభించినట్లు వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ గురువారం అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రపంచస్థాయిలో అత్యంత ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలను గుర్తించి వారిలో 2 శాతం శాస్త్రవేత్తల పేర్లను ప్రకటిస్తుందని, అందులో భాగంగా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ బొగ్గవరపు నాగేశ్వరరావు, బయో టెక్నాలజీ విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ ఎం. జానకి రామయ్య పేర్లను 2023 సంవత్సరానికి ప్రకటించిన జాబితాలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, జానకి రామయ్యలను వర్సిటీ ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ , ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. శ్రీనివాసులు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విజయ్ కుమార్‌లు అభినందించారు.

రాష్ట్ర ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ


పతకాలు సాధించిన చిన్నారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): కాకినాడలో ఈ నెల 12న జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన చిన్నారులు పలు పతకాలు సాధించారని జిల్లా ఫెన్సింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి డి.అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-10 వ్యక్తిగత విభాగంలో అద్దేపల్లి ఆశియా హస్నా బంగారు పతకం, టీం విభాగంలో రజతకం, అండర్-10 వ్యక్తిగత విభాగంలో మల్లి జోస్నిక రెడ్డి, చింతా ఆరోహిణి, కొల్లిపర శాన్వి, మందాలి నైనిక రెడ్డి, కాకర్ల లక్ష్మీ కార్తిక కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. అండర్-10 బాలకల టీం విభాగంలో ప్రథమ స్థానం పొందారని పేర్కొన్నారు. అండర్-10 బాలురల్లో పొత్తూరు విశాంక్ శర్వాంగ్‌కు కాంస్యం సాధించాడని చెప్పారు.

గుంటూరు డివిజన్ పరిధిలో పలు రైళ్ల రద్దు

లక్ష్మీపురం: అభివృద్ధి పనుల నేపథ్యంలో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఈనెల 15నుంచి 17 వరకు పలు రైళ్లను రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ గురువారం వెల్లడించారు. హుబ్లీ-విజయవాడ (నంబర్- 17239) రైలు ఈనెల 15 నుంచి 17 వరకు, విజయవాడ-హుబ్లీ (17330) ఈనెల 16 నుంచి 18 వరకు, గుంటూరు -కాచిగూడ (17251) ఈనెల 15 నుంచి 17 వరకు, కాచిగూడ-గుంటూరు (17252) ఈనెల 16 నుంచి 18 వరకు, గుంటూరు-సికింద్రాబాద్ (17253) ఈనెల 15 నుంచి 17 వరకు రద్దు చేసినట్లు వెల్లడించారు. సికింద్రాబాద్-గుంటూరు (17254) ఈనెల 15 నుంచి 17 వరకు , మెదక్-కాచిగూడ (07578) ఈనెల 16 నుంచి 18 వరకు, కాచిగూడ-మెదక్ (07577) ఈనెల 16 నుంచి 18 వరకు, మచిలీపట్నం-మంత్రాలయ రోడ్ (07067) ఈనెల 16న, మంత్రాలయ రోడ్-మచిలీపట్నం (07068) ఈనెల 17న రద్దు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి, సహకరించాలని కోరారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్‌గా డాక్టర్ రవిశంకర్ రెడ్డి



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్‌గా యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి రవిశంకర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ రవిశంకర్ రెడ్డి ఇప్పటి వరకు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ రవిశంకర్ రెడ్డికి యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణకు కృతజ్ఞతలు తెలిపారు.

స్కిల్ హబ్‌లలో ట్రైనర్లుగా అవకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ నైపుణ్య కోర్సుల్లో శిక్షణ కల్పించేందుకు అర్హత గల శిక్షకులను ఎంపిక చేస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నైపుణ్య శిక్షణలో భాగంగా వివిధ విభాగాల్లో ట్రైనింగ్, ఆఫ్ ట్రైనర్స్ ప్రోగ్రాం ద్వారా అర్హత, అనుభవం కలిగిన వారికి 10 రోజులు శిక్షణ అందించి, సర్టిఫికేషన్ పూర్తి చేసిన వారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లలో శిక్షకులుగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉత్సాహవంతులైన అభ్యర్థులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాల కోసం తమ ప్రతినిధి నరేష్‌ను 9866366187లో సంప్రదించాలన్నారు.

న్యాయస్థానాల ప్రాంగణాల్లో భద్రతా పరిరక్షణకు పరిశీలన

సత్తెనపల్లి: న్యాయస్థానాల్లో భద్రతా పరిరక్షణకు పోలీసు ఉన్నతాధికారులతో కూడిన బృందం జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తోంది. దీనిలో భాగంగా గురువారం సత్తెనపల్లి సబ్‌కోర్టు ప్రాంగణాన్ని ఏఆర్ పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రాజు, ఏఆర్ డీఎస్పీ చిన్ని కృష్ణతో కూడిన బృందం సత్తెనపల్లి సబ్‌కోర్టును సందర్శించింది. ముఖ్యంగా న్యాయస్థాన ప్రాంగణాల్లో సెక్యూరిటీ, సీసీ కెమెరాలు, కోర్టు గార్డులు, సంచలనాత్మకమైన తీర్పులు ప్రకటించే సమయంలో అదనపు సెక్యూరిటీ, పార్కింగ్, మెటల్ డిటెక్టర్స్, పెట్రోలింగ్, అత్యవసర వైద్యం, కమ్యూనికేషన్స్, ఫైర్ ఫిట్టింగ్స్, మొబైల్ బారికేడ్లు తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్త పరిశీలనలో భాగంగా సత్తెనపల్లి సబ్ కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించి నమోదు చేసుకున్నారు. వారితోపాటు సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ ఉన్నారు.

భద్రాచలం రాములోరి నైవేద్యానికి అత్తోట బియ్యం

ఉత్సవంగా తొలి సమర్పణ


బియ్యంతో ప్రకృతి రైతులు, భూమి భారతి నిర్వాహకులు

తెనాలి: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి నిత్యం సమర్పించే 'బాల భోగం' నైవేద్యానికి కొల్లిపర మండల గ్రామం అత్తోటలోని 'భూమి భారతి' నుంచి బియ్యాన్ని పంపారు. ప్రకృతి వ్యవసాయం, దేశవాళీ వరి విత్తన నిధి, గోఆధారిత ఉత్పత్తుల కేంద్రమైన 'భూమి భారతి' ఆధ్వర్యంలో రైతులు ప్రకృతి విధానంలో పండించిన అయిదు రకాల బియ్యాన్ని సమర్పించారు. అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయులు జయశేఖర్ తాళ్లూరి-నీలిమ తాళ్లూరి దంపతుల సౌజన్యంతో ఏడాదిపాటు ప్రతినెలా ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని భద్రాచలం దేవస్థానానికి సమర్పిస్తారు. తొలిగా అయిదు రకాల బియ్యం మూడు కిలోలను గురువారం సాయంత్రం ప్రత్యేక వాహనంలో పంపారు. ఈ సందర్భాన్ని వేడుక చేశారు. భూమి భారతి కేంద్రం నుంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. చెక్క భజనలు, మేళతాళాలతో ఊరేగింపుగా ఊరి వెలుపల వరకు సాగనంపారు. కార్యక్రమంలో అత్తోట గ్రామానికి చెందిన ప్రకృతి రైతులు, భూమి భారతి నిర్వాహకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా దేహదారుఢ్య పరీక్షలు


అభ్యర్థుల పరుగు పోటీలను పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా కొనసాగుతున్నాయి. ముందుగా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల్ని పోలీసు అధికారులు నిశితంగా పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతలను నమోదు చేసుకున్నారు. అనంతరం జరిగిన 100, 1,600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీల్లో అర్హత సాధించేందుకు అభ్యర్థులు పోటీపడ్డారు. 705 మందికి గానూ 384 మంది అర్హత సాధించారు.

గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, మంగళగిరి బెటాలియన్ కమాండెంట్ కె.ఎస్.ఎస్.వై సుబ్బారెడ్డి గురువారం గ్రౌండ్‌లో మౌలిక సౌకర్యాల్ని పరిశీలించారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐజీ పాలరాజు పోలీస్ అధికారుల్ని ఆదేశించారు. సందేహాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా పోటీల్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.సుప్రజ, డీఎస్పీలు శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రావు, నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు, ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, ఆర్‌ఐలు, సీఐలు, ఎస్‌ఐలు, మినిస్ట్రీయల్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో తాగునీటి పథకం

- ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు
- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం


మాట్లాడుతున్న ఎంపీ లావు, పక్కన ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ ఏసురత్నం

గురజాల: రూ.2 కోట్లతో తాగునీటి పథకం ప్రారంభించి ప్రతి ఇంటికీ కృష్ణానది నీటిని అందించడం జరుగుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో గురువారం రాత్రి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సీసీ రోడ్లను వారు ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పులిపాడు గ్రామం అభివృద్ధి చెందిందన్నారు. అర్హత ఉంటే చాలు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత పాలకులు అభివృద్ధి చేయకుండా కేవలం దాచుకో... దోచుకో అనే నినాదంతో పనులు చేశారని విమర్శించారు. అభివృద్ధి చేయడానికి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, గుంటూరు రైల్వే బోర్డు డైరెక్టర్ కె రవిశంకర్ పాల్గొన్నారు.





ఫ్యాషన్

విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్

విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్‌ని ఇప్పుడు యూత్ ఫాలో అవుతోంది.
ఫోక్ సాంగ్స్‌ని ఆనందించినట్టే
ఫోక్ డ్రెస్సింగ్‌తో ఆకట్టుకోవాలనుకుంటున్నారు.
ట్రెండ్‌ను ఫాలో అవ్వద్దు, ట్రెండ్ సెట్టర్‌గా ఉండాలి అనే ట్యాగ్‌తో
కొంత వెస్టన్ టచ్‌ని జత చేసి మరీ మెరిసిపోతున్నారు.
ఈ గణపతి నవరాత్రులకు మనదైన కళతో
వెలిగి పోవాలనుకునేవారికి ఈ స్టైల్ సరైన ఎంపిక అవుతుంది.



ధోతీ ప్యాంట్స్‌లో ఎన్నో మోడల్స్ వచ్చాయి. ఇవి అబ్బాయిల కోసమే అనేది పాత మాట. ప్రాచీన జానపద మూలాంశాలతో మనదైన సంప్రదాయ కళతో రూపొందింది ఈ స్టైల్. టులిప్ ప్యాంట్‌గా టర్న్ అయిన ఈ స్టైల్ ఈ నవరాత్రి వేడుకలలో హైలైట్ కానుంది. హెవీ ఎంబ్రాయిడరీ, పాట్లీ, షెల్ లేస్ ఉన్న ఫ్లెయిరీ కేడియా టాప్ నవరాత్రి ఉత్సవంలో రాక్ అండ్ రోల్ చేయడానికి పర్ఫెక్ట్ అవుట్ ఫిట్. ఇవి విదేశాలలోనూ చాలా ప్రాచుర్యం పొందాయి. చందేరీ, మధుబని, బ్లాక్ ప్రింట్‌లతో కలిపి ఈ ప్రత్యేకమైన దుస్తులను సిద్ధం చేస్తున్నారు డిజైనర్లు.



షర్ట్ అండ్ స్కర్ట్

ప్రింటెడ్ స్కర్ట్ లేదా పలాజో స్కర్ట్, కాలర్ నెక్ షర్ట్ సౌకర్యంగానూ ఉంటుంది. విలేజ్ స్టైల్‌కి వెస్టన్ టచ్ ఇచ్చినా సంప్రదాయ లుక్‌తో ఆకట్టుకుంటుంది. ట్రైబల్ జ్యువెలరీ ధరిస్తే చాలు న్యూ లుక్‌తో మెరిసిపోతారు.

చెక్స్ శారీస్..

సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా మనదైన సంస్కృతిని ప్రతిబింబించేది చీరకట్టు. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా, పండగలు, ప్రత్యేక రోజుల్లో మాత్రం చీర ధరించడం ఇప్పటికీ చూస్తుంటాం. అయితే.. వింటేజ్, విలేజ్‌తో పాటు ఫోక్ స్టైల్ కూడా కట్టులో తీసుకురావాలంటే మాత్రం చెక్స్ కాటన్ శారీ, సిల్వర్ జ్యువెలరీ మంచి ఎంపిక అవుతుంది.





మనవైన హ్యాండ్లూమ్స్

ఇక్కత్, బ్లాక్ ప్రింట్ అనార్కలీ, అంగరఖా, లాంగ్ గౌన్లు విలేజ్ స్టైల్‌లో ఆకట్టుకుంటాయి. ఘాగ్రా లేదా ఏదైనా పట్టు లెహంగా వంటివి ధరించినప్పుడు పటోలా దుపట్టాలు వేసుకుంటే విలేజ్ స్టైల్‌కి దగ్గరగా ఉన్నట్టే కాదు ప్రత్యేకంగానూ కనిపిస్తారు.



వినాయకుడికి వెరైటీ స్వీట్లు

ఈసారి వినాయకుడికి ఎంతో
ఇష్టమైన ఉండ్రాళ్లు, ఇతర నైవేద్యాలతోపాటు...
వైవిధ్యభరితమైన
మరెన్నో స్వీట్లను తినిపించి
ప్రసన్నం చేసుకుందాం....

వంటిల్లు



బనానా మోదక్

కావలసినవి: గోధుమ పిండి – కప్పు; అరటిపండ్లు – రెండు; బెల్లం – ముప్పావు కప్పు; పచ్చికొబ్బరి తురుము – టేబుల్ స్పూను; అటుకులు – రెండు టేబుల్ స్పూన్లు; సూజీ రవ్వ – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – చిటికెడు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అరటిపండ్లు, బెల్లం, కొబ్బరి తురుము, అటుకులు, సూజీరవ్వను మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లుపోసి పేస్టులా గ్రైండ్ చేయాలి ● ఈ పేస్టుని పెద్దగిన్నెలో వేసి... గోధుమ పిండి, ఉప్పు, నెయ్యి, యాలకుల పొడి అన్ని కలిసిపోయేలా చక్కగా కలపాలి ● ఇప్పుడు ఈ పిండిని మోదక్‌లా లేదా నచ్చిన ఆకారంలో చేసుకుని మరుగుతోన్న నూనెలో వేసి డీప్ ఫ్రైచేయాలి ● మీడియం మంట మీద రెండు వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు ఫ్రై చేస్తే బనానా మోదక్ రెడీ.

పనస పారోలి

కావలసినవి: బియ్యం – కప్పు; పనసపండు తురుము – ఒకటిన్నర కప్పులు (తొనలను సన్నగా తురమాలి); పచ్చికొబ్బరి తురుము – పావు కప్పు; అరటి ఆకులు – పాతోలీకి సరిపడా.
స్టఫింగ్ కోసం: పచ్చికొబ్బరి తురుము – కప్పు; బెల్లం – ముప్పావు కప్పు; యాలుకలుపొడి – అరటీస్పూను.

తయారీ: ● బియ్యాన్ని కడిగి రెండు గంటలపాటు నానబెట్టుకోవాలి ● మందపాటి బాణలిలో బెల్లం, నాలుగు టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి వేసి మరిగించాలి ● బెల్లం కరిగి నురగలాంటి బుడగలు వస్తున్నప్పుడు పచ్చికొబ్బరి తురుము వేయాలి ● పాకంలో గరిట పెట్టి కలియతిప్పుతూ మిశ్రమం దగ్గర పడేంత వరకు మగ్గనివ్వాలి ● నీరంతా ఇంకిపోయినప్పుడు అర టీస్పూను యాలకుల పొడి కలిపి చల్లారనివ్వాలి ● ఇప్పుడు నానిన బియ్యంలో నీళ్లు తీసేసి బ్లెండర్‌లో వేయాలి ● దీనిలోనే పనసపండు తురుము, కొబ్బరి తురుము వేసి మెత్తని పేస్టులా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని గిన్నెలో తీసుకోవాలి ● ఇప్పుడు అరటి ఆకులను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడుచుకోవాలి ● రుబ్బుకున్న బియ్యం పేస్టుని అరటి ఆకులపైన మందపాటి పొరలాగా వేసుకోవాలి. పొర మరీ మందంగా, మరీ పలుచగా కాకుండా మీడియంగా ఉండాలి ● చల్లారిన బెల్లం కొబ్బరి తురుముని పొరపైన మధ్యలో వేయాలి ● ఇప్పుడు అరటి ఆకుని నిలువుగా మడిచి ఆవిరి పాత్రలో పెట్టుకోవాలి ● ఈ ఆకులను ముప్పై నిమిషాలపాటు ఆవిరిమీద ఉడికిస్తే పనస పాతోలీ రెడీ.



పతిశప్త

కావలసినవి:
మైదా – అరకప్పు; సూజీ రవ్వ – నాలుగు టేబుల్ స్పూన్లు; బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – టేబుల్ స్పూను; వంటసోడా – పావు టీస్పూను; పాలు – కప్పు; నెయ్యి – నాలుగు టేబుల్ స్పూన్లు.
స్టఫింగ్ కోసం: కోవా – కప్పు; ఎండుకొబ్బరి పొడి – ముప్పావు కప్పు; పంచదార పొడి – అర కప్పు; జీడిపప్పు – పది (సన్నగా తరగాలి); యాలకుల పొడి – అరటీస్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో సూజీ రవ్వ, బియ్యప్పిండి, వంటసోడా టేబుల్ స్పూను పంచదార పొడి, పాలు వేసి దోశ బ్యాటర్‌లా కలుపుకొని అరగంట నానబెట్టుకోవాలి ● బాణలిలో కోవా వేసి సన్నని మంట మీద వేయించాలి ● రంగు మారి మంచి వాసన వస్తున్నప్పుడు మంట ఆపేసి కొబ్బరి, పంచదార, యాలకులపొడి, జీడిపప్పు తరుగు వేసి కలపాలి ● ఇప్పుడు వేడెక్కిన పెనంపై కలిపి పెట్టుకున్న బ్యాటర్‌ను టేబుల్ స్పూను వేసి పలుచని చిన్న అట్టులా పోసుకోవాలి. దీనిచుట్టూ నెయ్యివేసి రెండు వైపులా బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు కాల్చాలి ● చక్కగా కాలిన అట్టు మధ్యలో కోవా మిశ్రమం వేసి రోల్‌లా చుట్టి పక్కన పెట్టుకోవాలి ● ఇలా బ్యాటర్ మొత్తాన్నీ రోల్స్‌లా చేసుకుంటే పతిశప్త రెడీ.



సేమియా లడ్డు

కావలసినవి: వేయించిన సేమియా – కప్పు; కోవా – అరకప్పు; పంచదార – ఐదు టేబుల్ స్పూన్లు; రోజ్‌వాటర్ – టీస్పూను; బాదం పలుకులు – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● బాణలిలో పంచదార వేసి సన్నని మంటమీద కరగనివ్వాలి ● పంచదార కరుగుతున్నప్పుడే కోవా వేసి తిప్పాలి ● పంచదార కరిగి మిశ్రమం దగ్గర పడినప్పుడు సేమియా, బాదం పలుకులు వేసి కలపాలి ● అన్ని చక్కగా కలిసిన తరువాత రోజ్‌వాటర్ వేసి మరోసారి కలిపి స్టవ్ మీద నుంచి దించేయాలి ● ఇప్పుడు మిశ్రమాన్ని లడ్డుల్లా చుట్టుకుంటే వర్మిసెల్లి లడ్డు రెడీ.



స్వీట్ సందేష్

కావలసినవి: ఉడికించిన చిలగడ దుంప – పెద్దది ఒకటి; పచ్చికొబ్బరి తురుము – ముప్పావు కప్పు; జీడిపప్పు పొడి – పావు కప్పు; కొబ్బరి పాలు – అరకప్పు; పంచదార – అరకప్పు; యాలకులపొడి – అరటీస్పూను; రోజ్ వాటర్ – టీస్పూను.

తయారీ: ● చిలగడ దుంప తొక్క తీసి ఉండలు లేకుండా మెత్తగా చిదుముకోవాలి ● చిదుముకున్న చిలగడ దుంప మిశ్రమంలో జీడిపప్పు పొడి వేసి కలపాలి ● పంచదారలో కొద్దిగా నీళ్లుపోసి సుగర్ సిరప్‌ను తయారు చేసుకోవాలి ● సిరప్ తయారయ్యాక కొబ్బరి తురుము వేసి కలుపుతూ ఉండాలి ● తీగ పాకం వచ్చినప్పుడు చిలగడదుంప మిశ్రమాన్ని వేసి కలపాలి ● మిశ్రమం దగ్గర పడుతున్నప్పుడు కొద్దిగా కొబ్బరిపాలు వేయాలి ● మధ్యలో కొబ్బరి పాలతోపాటు యాలకులపొడి, రోజ్ వాటర్ వేసి కలుపుతూ మొత్తం కొబ్బరి పాలు అయిపోయేంత వరకు మగ్గనివ్వాలి ● దాదాపు ఇరవై నిమిషాల తరువాత ఈ మిశ్రమం దగ్గర పడుతుంది. అప్పుడు స్టవ్ ఆపేసేయాలి ● గోరువెచ్చగా ఉన్నప్పుడే మిశ్రమాన్ని చేతుల తోగానీ, మౌల్డ్స్‌లోవేసి నచ్చిన ఆకారంలో వత్తుకుంటే స్వీట్ సందేష్ రెడీ.



కేసి మిథోయ్

కావలసినవి: తాజా బియ్యప్పిండి – రెండు కప్పులు; పచ్చికొబ్బరి తురుము – కప్పు; పంచదార పొడి – అరకప్పు; యాలకులపొడి అరటీస్పూను; కొబ్బరి నీళ్లు – అరకప్పు.

తయారీ: ● తడి బియ్యప్పిండిని ఒక గిన్నెలో వేసుకోవాలి ● దీనిలో కొబ్బరి తురుము, పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి ● అవసరాన్ని బట్టి కొబ్బరి నీళ్లను కొద్ది కొద్దిగా వేసి పిండిని ముద్దలా కలుపుకోవాలి ● పిండి ముద్దను చిన్న భాగాలుగా చేసి, ఉండలుగా చుట్టుకోవాలి ● పిండి మొత్తాన్ని ఉండలుగా చుట్టుకుంటే కేసి మిథాయ్ రెడీ ● కొబ్బరి నీళ్లకు బదులు కొద్దిగా నెయ్యికూడా కలుపుకోవచ్చు ● రిఫ్రిజిరేటర్లో రెండుమూడురోజుల వరకు ఇవి తాజాగా ఉంటాయి.



న్యూస్‌మేకర్

ఆగొద్దు, పరుగు తీయండి


విత్య, నిత్య

'ముగ్గురు ఆడపిల్లల్ని కన్నావ్. ఎలా పెంచుతావో' అని ఆ తల్లికి దారిన పోయేవారంతా సానుభూతి తెలిపేవారు. పేదరికంతో అలమటిస్తున్న కుటుంబం అది. ఆ తల్లి తన కూతుళ్లను ఆపదలచలేదు, ఆగిపోనివ్వలేదు. 'ఫ్రీగా తిండి పెడతారు. తిని పరిగెత్తండి' అని ఇద్దర్ని తీసుకెళ్లి స్పోర్ట్స్ హాస్టల్‌లో పడేసింది. కవలలైన ఆ ఇద్దరు అక్కా చెల్లెళ్లు ఇవాళ భారతదేశంలో మేలైన అథ్లెట్లుగా మారారు. ఆసియన్ గేమ్స్‌కు క్వాలిఫై అయ్యారు. కోయంబత్తూరుకు చెందిన విత్య, నిత్యల పరుగు కథ ఇది.

అబ్బాయిలు పుడితేనేనా సంతోషం? అమ్మాయిలు పుడితే బాధ పడాలా?

'నాకు లేని బాధ మీకెందుకు?' అని ఇరుగు పొరుగు వారితో అనేది మీనా.

కోయంబత్తూరులో నిరుపేదల కాలనీలో నివాసం ఉన్న మీనాకు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. 'సత్య' అనే పేరు పెట్టింది. రెండో కాన్పులో ఏకంగా కవల ఆడపిల్లలు పుట్టారు. వారికి 'విత్య', 'నిత్య' అనే పేర్లు పెట్టింది. భర్త రామరాజ్ లారీ డ్రైవరు. డ్యూటీ ఎక్కితేనే సంపాదన. ఇంట్లో ఎప్పుడూ పేదరికమే. దానికి తోడు 'ముగ్గురు ఆడపిల్లలు'! 'ఎలా పెంచుతావో ఏమో' అని ఇంటికొచ్చిన అందరూ అనేవారు. కాని మీనా అస్సలు బాధపడలేదు. భయపడలేదు. ఆడపిల్లలే కదా అని ఇంట్లో మగ్గేలా చేయలేదు. 'నా పిల్లలు చదువుకోవాలి. ఆడపిల్లలు పైకి రావాలంటే చదువే దారి' అని స్కూల్లో చేర్చింది. పెద్దమ్మాయి సత్య చక్కగా చదువుకుంటే కవలలు విత్య, నిత్యలు స్కూల్లో హాకీ బాగా ఆడటం మొదలుపెట్టారు. కాని ఇంట్లో ప్రతి పూటా ఐదుగురికి ముద్ద నోట్లోకి వెళ్లాలంటే కష్టమైన సంగతి.

స్కూల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ద్వారా స్పోర్ట్స్ స్కూల్ గురించి తెలిసింది. ఆ స్కూల్లో చేర్పితే చదువుతోపాటు ఆటలు నేర్పిస్తారు అని తెలుసుకుంది మీనా. ఇద్దరు కూతుళ్లు చిన్న పిల్లలు. ఏడవ తరగతిలో ఉన్నారు. కళ్ల ముందు పెరగాల్సిన బిడ్డలు. 'ఏం పర్వాలేదు. మీ భవిష్యత్తే ముఖ్యం. స్పోర్ట్స్ స్కూల్లో కడుపు నిండా తిని బాగా పరిగెత్తండి' అని చెప్పి కవల సోదరీ మణులైన విత్య, నిత్యలను కోయంబత్తూరులోని స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్పించింది. ఆ తల్లి తపనను కూతుళ్లు అర్థం చేసుకున్నారు. బాగా ఆడారు. ఇవాళ విజేతలుగా నిలిచారు.

ఆసియా గేమ్స్ ఆశాకిరణాలు

మన దేశం నుంచి ఆసియా గేమ్స్‌లో పాల్గొన్న కవల క్రీడాకారులు తక్కువ. వారిలో మహిళా అథ్లెట్లు ఇంకా తక్కువ. మరో తొమ్మిది రోజుల్లో హాంగ్జవ్ (చైనా)లో మొదలుకానున్న ఆసియన్ గేమ్స్‌లో విత్య రామరాజ్, నిత్య రామరాజ్ పేర్లతో ఈ కవలలు పాల్గొనబోతున్నారు. విత్య 400 మీటర్ల హర్డిల్స్, ఫ్లాట్ రన్‌లో పాల్గొంటుంటే నిత్య 100 మీటర్ల పరుగులో పాల్గొననుంది. మన దేశం నుంచి మొత్తం 65 మంది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు ఆసియా గేమ్స్ కోసం ఎంపికైతే వారిలో విత్య, నిత్య ఉన్నారు. 'ఇద్దరం ఎంపిక కావడంతో అమ్మ ఆనందానికి అవధులు లేవు. ఎవరో ఒకరు మాత్రమే అయితే ఆమె తప్పక బాధపడేది. ఆమె కోసం, దేశం కోసం ఎలాగైనా పతకాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నాం' అన్నారు విత్య, నిత్య.

పి.టి. ఉషతో సమానంగా

విత్య రామరాజ్ చెన్నైలో శిక్షణ పొంది గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ స్థాయి బంగారు పతకాలు గెలుస్తూ వచ్చింది. రెండ్రోజుల క్రితం చండీగఢ్‌లో జరిగిన గ్రాండ్‌ప్రిలో 400 మీటర్ల హర్డిల్స్‌ను 55.4 సెకెండ్లలో పూర్తి చేసింది. ఇది 1984 ఒలింపిక్స్‌లో పి.టి. ఉష రికార్డుకు కేవలం 0.01 సెకండ్ల కంటే తక్కువ. అంటే 39 సంవత్సరాల తర్వాత ఆ స్థాయి ప్రతిభను చూపే అథ్లెట్‌గా విత్య అవతరించింది. ఆనాడు ఆమె తల్లి ఆమెను ప్రోత్సహించకపోతే, ఆడపిల్లే అనుకుని ఖర్మకు వదిలిపెడితే ఈ రోజున ఇంత ప్రతిభతో నిలిచేదా? అలాగే నిత్య కూడా 100 మీటర్ల హర్డిల్స్‌లో మంచి ప్రతిభ చూపుతోంది. 'మేమిద్దరం ఆసియా గేమ్స్‌లో మెడల్స్ సాధించి ఒలింపిక్స్‌కు వెళ్లాలని అనుకుంటున్నాం. ఆశీర్వదించండి' అంటున్నారు విత్య, నిత్య.

ఇలాంటి క్రీడాకారిణులకు అందరి ఆశీస్సులూ ఉంటాయి.


తల్లి మీనాతో విత్య, నిత్య